
నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

ఆదివారం 26 నవంబర్ 2023
SUNDAY, NOVEMBER 26, 2023

RANGAREDDY

పేజీలు : 12
PAGES

ఆమనగల్లులో జనం లేక వెల వెల బోతున్న కాంగ్రెస్ సభ

# కాంగ్రెస్ పని ఖతం

జిల్లాలో మూడు చోట్ల కాంగ్రెస్ సభలు అట్టర్ ఫ్లాప్

జనం లేక వెలవెలబోయిన సభా ప్రాంగణాలు

షాద్‌నగర్‌లో సభకు ముఖం చాటేసిన రేవంత్

వేచి చూసి విసిగిపోయి ఇంటిముఖం పట్టిన జనం

ఆమనగల్లులో జరిగిన మల్లికార్జున్ ఖర్గే, రేవంత్ సభకు ముందుగానే జనం జంప్

తుర్కయాంజాల్ కార్నర్ మీటింగ్‌కూ రేవంత్ డుమ్మా

చర్చనీయాంశంగా ఎంపీ వెంకట్‌రెడ్డి గైర్హాజరు


రంగారెడ్డి, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): జనం లేక వెలవెలబోతున్న సభలతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రంగారెడ్డి జిల్లాలో శనివారం పలు చోట్ల సభలు జరిగాయి. తుర్కయాంజాల్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌కు, షాద్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభకు రేవంత్ రెడ్డి డుమ్మా కొట్టారు. ఆమనగల్లులో జరిగిన బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరైనప్పటికీ ఖాళీ కుర్చీలే కనిపించాయి. దీంతో సభలు మూడు చోట్లా అట్టర్ ఫ్లాప్ అయ్యాయి.

కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లులో శనివారం కాంగ్రెస్ పార్టీ విజయభేరీ సభను నిర్వహించింది. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సభకు జనం తక్కువగా వచ్చారు.. సభ ప్రారంభం ఆలస్యం కావడంతో ఉన్న ఆ కొందరు కూడా ఇంటి ముఖం పట్టారు. షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన విజయ భేరీ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవ్వాల్సి ఉన్నది. ఉదయం 11 గంటలకే సభ జరగాల్సి ఉండగా.. రేవంత్ ఎంతకూ రాకపోవడంతో విసిగిపోయిన జనం వెనుదిరిగిపోయారు. జనాలు ఇంటిముఖం పడుతున్న వీడియోలను తీస్తుండగా.. కాంగ్రెస్ నేతలు మీడియా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తుర్కయాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్నర్ మీటింగ్ సైతం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఉదయం 11 గంటలకే మీటింగ్ ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి వస్తారా? రారా? అనే విషయంలో స్పష్టత లేక సాయంత్రం రేవంత్ లేకుండానే మీటింగ్‌ను కానిచ్చేశారు. ఇబ్రహీంపట్నం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిధిలో ఉండడంతో రేవంత్ రెడ్డి ఇక్కడకు రావడం కోమటిరెడ్డికి ఇష్టంలేదని సమాచారం. ఈ పరిస్థితుల కారణంగానే రేవంత్ రెడ్డి చివరి నిమిషంలో తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిసింది.



షాద్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభలో జనం లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు..



3 గంటల కరెంటుతో బతుకులు ఆగం..

10 హెచ్‌పీ మోటర్లతో మోయలేని భారం

శనిలా దాపురించిన కాంగ్రెస్ పార్టీని తరిమికొడుతామంటున్న రైతులు

మళ్లీ కేసీఆరే రావాలి.. రైతు సంక్షేమం కొనసాగాలంటూ నినాదం

# కాంగ్రెస్ అంటేనే.. కటిక చీకట్లు

**పదేండ్ల కిందటి కరెంటు కష్టాలు,** సాగు బాధలు ఇప్పటికీ కండ్లముందు కదలాడుతున్నాయని, కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ ఆ కష్టాలను తెచ్చుకోబోమని జిల్లా అన్నదాతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ ఇస్తున్న పంట పెట్టుబడి, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటితో దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కటకట తప్పదంటున్నారు. కాంగ్రెస్ హయాంలో రాత్రిళ్లు మోటర్లు పెట్టేందుకు బావుల వద్దకు వెళ్లి పాములు, తేళ్లు కుట్టి, విద్యుత్ షాక్‌కు గురై రైతులు ప్రాణాలొదిలిన ఘటనలు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదంటున్నారు. మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అంటూ కాంగ్రెస్ నేతలు పూటకో మాట మాట్లాడుతుంటేనే పాతరోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. రైతులపై అదనపు భారాన్ని మోపి రుణగ్రస్తులుగా చేసే కుట్రలను తరిమికొడుతామంటున్నారు. నాడు కరెంట్ ఎప్పుడొస్తదా అని రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి ఉండేదని, నేడు నిరంతర కరెంట్‌తో పండుగలా పంటలను సాగు చేసుకుంటున్నామన్నారు. వ్యవసాయంపై ఏమాత్రం అవగాహనలేని రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆయన ఓటుకు నోటు, సీట్ల అమ్మకంపై ఉన్న శ్రద్ధ రైతుల సంక్షేమంపై లేదని ఘాటుగా విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సాగు పొలాలన్నీ బీడు భూములుగా మారే ప్రమాదముందని, మరోసారి బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటామని చెబుతున్నారు. -రంగారెడ్డి, నవంబర్ 25(నమస్తే తెలంగాణ)

సెంటర్ స్ప్రెడ్‌లో..

### పాతరోజులు రానియ్యం..



తెలంగాణ రాక మందు మా ముసలాయన బోరు మోటరు వద్దకు వెళ్లి రాత్రంతా ఇబ్బందిపడేవాడు. ఆ దుస్థితిని మళ్లీ ఇప్పుడు తేవడానికి కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది. 3 గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అది సాధ్యమేకాదు. సీఎం కేసీఆర్ 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నారు. దీన్ని చూసి కాంగ్రెస్ ఓర్వలేకనే పాత రోజులను తేవాలనుకుంటున్నారు. వారి ఆటలు సాగనివ్వం.

**- దేవమ్మ, మహిళా రైతు, తీగాపూర్, కొత్తూరు**

### మళ్లీ కేసీఆర్ సార్ పాలనే కావాలి..



సీఎం కేసీఆర్ పాలనతోనే కరెంట్ కష్టాలు తప్పినాయి. కాంగ్రెస్ హయాంలో అర్ధరాత్రి కరెంట్ ఇచ్చేవారు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక రైతులందరం వ్యవసాయ బావుల వద్దనే పడుకునేది. కాంగ్రెస్ వస్తే రైతులకు మళ్లీ చీకటి రోజులు వచ్చినట్లే. రైతులను ఇబ్బందులకు నెట్టాలనుకునే కాంగ్రెస్ పార్టీ మాకొద్దు. రైతుల కష్టాలు తెలిసిన నేత, సీఎం కేసీఆర్ పాలనే మళ్లీ కావాలి.


**-ఆర్ల బీరప్ప, ఆరుట్ల, మంచాల**

# కౌలు చట్టంతో.. రైతుబంధుకు మంగళం

బీఆర్ఎస్ మళ్లీ రావాలి.. ధరణి ఉండాలంటున్న అన్నదాతలు

**ధరణి పోర్టల్ తో** రైతులకు పారదర్శక సేవలందుతుండడంతోపాటు అవినీతి, అక్రమాలకు చెక్ పడింది. ఇంతటి ప్రాధాన్యమున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేయడంపై అన్నదాతలు భగ్గుమంటున్నారు. ధరణిని తీసేస్తే మళ్లీ డబుల్ రిజిస్ట్రేషన్లు, దళారుల వ్యవస్థ, అవకతవకలు చోటుచేసుకునే అవకాశముందని, రైతుల బతుకులు దినదినగండంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రైతుబంధు పథకం నిలిచిపోయి అన్నదాతలు మళ్లీ అప్పులు చేసే పరిస్థితి వస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'ధరణి'ని తీసేసి 'భూ మాత' పోర్టల్‌ను తెచ్చి పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడుతున్నారు. మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటామని, ధరణి పోర్టలే ఉండాలని రైతాంగం కోరుకుంటున్నది.

-రంగారెడ్డి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)



సెంటర్ స్ప్రెడ్‌లో..

### ధరణి పోతే పైరవీకారులదే రాజ్యం అయితది..



ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే దళారులు, పైరవీకారులదే రాజ్యం అవుతుంది. అలా జరిగితే భూ వ్యవహారాలు అతలాకుతలమవుతాయి. మళ్లీ ఇబ్బందులు తప్పవు. రైతులు ప్రశాంతంగా జీవిస్తున్న సమయంలో కాంగ్రెస్ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నది. కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో ఎవరూ లేరు. రైతులకు మేలు చేసే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. రైతులందరం కారుగుర్తుకే ఓటేస్తాం

**- జి.రవి, రైతు, చేవెళ్ల గ్రామం, చేవెళ్ల రూరల్**